

నేడు సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య చెప్పారు. ఈ మేరకు 28 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యులకు పంపినట్లు చెప్పారు. అందరూ వార్డు మెంబర్లు సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఇటీవల ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కొందరు కౌన్సిలర్లు ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విధితమే. అయితే తాను వైసిపి కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ఛైర్‌పర్సన్ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం నాటి కౌన్సిల్ సమావేశం ఎలా జరుగుతుందని సర్వత్ర ఉత్కంఠ వ్యక్తం అవుతుంది.

మధుర ఫలం... విష తుల్యం

- కార్బైడ్‌తో మాగబెట్టి మామిడి విక్రయాలు
- మార్ట్‌లు, హోల్‌సేల్ మార్కెట్లలోనే అధికం
- వ్యాపారుల ఇష్టారాజ్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మధుర ఫలం విషతుల్యం అవుతుంది. వ్యాపారుల అత్యాశ మామిడి పండ్ల ప్రియులను అనారోగ్యాలపాల్జేస్తుంది. కార్బైడ్‌తో మాగబెట్టి సొమ్ము మూటగట్టుకుంటూ.. ప్రజారోగ్యాన్ని పక్కన బెడుతున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారు.

మామిడి పళ్ల సీజన్ వచ్చేసింది. అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఎక్కడ చూసినా అవే దర్శనమిస్తున్నాయి. రాజమహేంద్రవరం నుంచి తుని వెళ్లే జాతీయ రహదారి వెంబడి మామిడి పళ్ల విక్రయాలు జరుగుతున్నాయి. చూస్తే నోరురేలా నిగనిగలాడుతున్నాయి. పండ్లలో ఉండే విటమిన్లతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వైద్యులు చెబుతుంటారు. దీంతో మామిడి పళ్లను తినడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. అయితే ధనార్జనే లక్ష్యంగా కొంతమంది వ్యాపారులు వాటిని మాగబెట్టేందుకు రసాయనాలను వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2012లో నిషేధించిన కార్బైడ్‌తో మాగబెడుతున్నారు. అయినా సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఏటా మార్కెట్లలో అవే దర్శనమిస్తున్నాయి.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తుని, తొండంగి, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, శంఖవరం, ప్రత్తిపాడు, కోరుకొండ, రాజానగరం తదితర మండలాల్లో సుమారు 38 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. ఏటా దాదాపు 70 వేల మెట్రిక్ టన్నుల పళ్లదిగుబడి వస్తున్నట్లు అంచనా. అయితే ఈ ఏడాది అననుకూల పరిస్థితులు నెలకొనడంతో 40 శాతం దిగుబడులు తగ్గాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మామిడికి డిమాండ్ బాగా పెరిగింది. పళ్లలో బంగినపల్లి, రసాలు, కొబ్బరి మామిడి, సువర్ణరేఖ రకాలు ఎక్కువగా అమ్మకాలు జరుగుతున్నాయి.

కార్బైడ్ రసాయనం వినియోగం

మామిడి కాయలను చెట్ల పైనే పక్వానికి వచ్చే వరకు ఉంచితే ఆ పండ్లు మధురంగా ఉండడంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తాయి. అలా కాకుండా గడ్డిలో మాగ పెట్టినా కుడా ఆపండ్లు రూచిగానే ఉంటాయని రైతులు చెబుతున్నారు. కానీ గడ్డిలో పెట్టి పండించాలంటే 3 నుంచి 5 రోజుల సమయం పడుతుంది. దీంతో కొందరు వ్యాపారులు, మధ్య దళారులు ప్రజల ఆరోగ్యాలను ఫణంగా పెట్టి కార్బైడ్ రసాయనాన్ని విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. వాటిని తినడం వలన ప్రజలు వివిధ రకాల వ్యాధులు గురవుతున్నారు. కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మామిడి పళ్లను ఎక్కడ చూసినా నోరూరుతోంది. ఈ సీజన్లో బంధవులు, స్నేహితులకు మంచి రకం పళ్ళను ఏటా పంపుతుంటాము. అయితే నిషేధిత రసాయనాలు వాడుతుండడం వలన కొనుగోలు చేయాలంటే బయపడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

మామిడిపండ్ల సీజన్ మొదలైంది. అప్పుడే మార్కెట్లోకి రసాయనాలతో మగ్గపెట్టిన పండ్లు విచ్చలవిడిగా వస్తున్నాయి. అయితే ఆహార భద్రతాధికారుల పర్యవేక్షణ మాత్రం కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తూతుమంత్రంగా మాత్రమే తనిఖీలు నిర్వహిస్తున్నారని సిటీజన్స్ తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. విషపూరితమైన పండ్లను తిని రోగాలపాలవుతున్నా అధికారులు వ్యాపారులు ఇచ్చే మామూళ్ల మత్తులో జోగుతున్నారని ధ్వజమెత్తుతున్నారు. నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై ప్రారంభంలోనే చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

రోగాలు వ్యాప్తి చెందుతాయి

కార్బైడ్ రసాయనాలతో మాగపెట్టిన మామిడి పండ్లను తినడం వలన దీర్ఘకాలిక రోగాలు వ్యాప్తి చెందుతాయి. ఈ మామిడి పళ్లను తీసుకున్నవారికి తొలుత కడుపు నొప్పి, ఆ తర్వాత గ్యాస్ట్రిక్ సమస్య, విరేచనాలు, వాంతులు మొదలవుతాయి. చివరకు మనిషి తీవ్ర అనారోగ్యం పాలవుతారు.

-డాక్టర్ విఠల్, ప్రముఖ సీనియర్ వైద్యులు, జిజిహెచ్ సూపరింటెండెంట్

రోగాలు వస్తే ఎవరు బాధ్యులు

ఈ సీజన్లో మామిడి పళ్లు తినడం వలన ఆరోగ్యానికి మంచిదే. అయితే పక్వానికి త్వరగా రావడం కోసం రసాయనాలు వినియోగిస్తున్నందు వలన అనారోగ్యానికి గురవుతున్నారు. ఎవరైనా ఆస్పత్రులపాలయితే ఎవరు బాధ్యత వహిస్తారు. దీనిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

ఎన్. సూర్యనారాయణ, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు

కాల్షియం కార్బైడ్ నిషేధం

మామిడి పళ్లు పక్వానికి రావడం కోసం వాడుతున్న కాల్షియం కార్బైడ్‌ను ప్రభుత్వం నిషేధించింది. ఇథిలీన్ గ్యాస్ వాడకంపై నిత్యం గ్రామాలలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని ఉపయోగించిన పళ్ళను అమ్మితే చట్ట పరమైన చర్యలకు గురవుతారు.

-నేతల మల్లికార్జునరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి



సభలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

కుల వివక్ష వ్యతిరేక పోరాటాలు నేటికీ అవసరం

కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - కరప

కుల వివక్ష వ్యతిరేక పోరాటాలు నేటికీ అవసరమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అన్నారు. మంగళవారం కరప గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి నూతనంగా నిర్మించిన షెల్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏ కుల వివక్ష అంతానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితాంతం పోరాటాలు చేశారో ఆ కుల వివక్ష నేటికీ దేశంలో తీవ్రంగా కొనసాగుతుందని అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాటాలు చేయడమే బాబాసాహెబ్ అంబేద్కర్‌కు ఘనమైన నివాళులర్పించినట్లు అవుతుందని అన్నారు. చైతన్యవంతమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేటికీ కుల వివక్ష, దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. ఇందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు. దేశ ప్రజలకు రక్షణగా ఉన్న రాజ్యాంగాన్ని మార్చివేసి మనువాద రాజ్యాంగాన్ని అమలులోకి తీసుకురావడం కోసం బిజెపి కుట్రలు చేస్తుందని దుయ్యబట్టారు. జిల్లాలో దళితులపై దాడులు పెరిగాయని, ఒక దళిత యువకుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటన మరువక ముందే పిఠాపురం మండలం మల్లంలోని దళితులను గ్రామ పెత్తందారులు సాంఘిక బహిష్కరణ చేయడం చూస్తే చట్టాలు ఎలా అమలవుతున్నాయో అర్థమవుతుందని అన్నారు. కుల విపక్షతోపాటు దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచినా నేటికీ దళిత గ్రామాలు ఎంతో వెనకబడి ఉన్నాయని, దళిత గ్రామాలు అభివృద్ధి కోసం కెవిపిఎస్ పోరాటాల ఫలితంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎస్‌సి సబ్ ప్లాన్ చట్టం వచ్చిందని అన్నారు. అని ఈ చట్టానికి కూడా తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోగలమని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుంటేనే ప్రజల హక్కులను కాపాడు కోగలమని అన్నారు. అంబేద్కర్ కృషి ఫలితంగా అంటరానితనం నిర్మూలన, రిజర్వేషన్లు, మహిళల హక్కులు, కార్మికుల హక్కులు వంటి అనేకం దేశ ప్రజలు పొందుతున్నారని గుర్తు చేశారు. పాలకుల ప్రయివేటీకరణ విధానాలవల్ల నేడు రిజర్వేషన్లు నీరు గారుతున్నాయన్నారు. ఒక ప్రక్క ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునే పోరాటాలు చేస్తూనే మరోప్రక్క ప్రయివేట్ రంగంలో ఎస్‌సి, ఎస్‌టిలకురిజర్వేషన్ కల్పించాలని కెవిపిఎస్ పోరాడుతుందన్నారు. గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఏ పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ విచ్చేసి నూతనంగా నిర్మించిన షెల్టర్‌ను ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె శ్రీరామచంద్రమూర్తి, డాక్టర్ నందిపాటి ప్రసన్‌కుమార్, జడ్‌పిటిసి వై.సుబ్బారావు ఎంపిపి పెంకే శ్రీలక్ష్మీ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుడితి సురేష్‌కుమార్, కె. సింహాచలం నాయకులు గోవిందు, వీరరాఘవులు, కొండబాబు, గంగాధర్, రమేష్ పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న సూరిబాబు రాజు

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 30న జరిగే పాలీసెట్ పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న పాలీసెట్ కోచింగ్ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులందరూ ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని పాలీసెట్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ శిబిరంలో శిక్షణ ఇచ్చిన బుద్ధా శ్రీనివాస్, నీలపాల బాల మురళీకృష్ణలను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి రవివర్మ, యాసలపు సూర్యారావు భవన కమిటీ అధ్యక్షులు సిరపరపు శ్రీనివాస్, సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, అమృత, నమ్రత, సాయి, బంగారం, కూనిరెడ్డి పవన్, మణికంఠ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో ప్రజానాట్యమండలి కళాకారులు అభ్యుదయ గీతాలను ఆలపించారు.

కార్టూ'నిజం'



12వ పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించాలి

ప్రజాశక్తి - కాకినాడ

12వ వేతన సవరణ సంఘానికి (పిఆర్‌సి) వెంటనే ఛైర్మన్‌ను నియమించాలని యూటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక యూటిఎఫ్ హోంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఏడాది పూర్తి కావస్తున్నా పిఆర్‌సి ఛైర్మన్ నియామకం చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల సమయంలో మేం అధికారంలోకి రాగానే పిఆర్‌సి కమిటీ నియమిస్తామని, డిఎలు సకాలంలో చెల్లిస్తామని, బకాయిలు చెల్లిస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీలన్నీ నీటి మూటలయ్యాయని విమర్శించారు. తక్షణమే 12వ వేతన సవరణ సంఘానికి ఛైర్మన్ నియమించి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి ధరలకు అనుగుణంగా భవిష్యత్తు అవసరతలు, ఆరోగ్య సూచికలు అనుగుణంగా వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈలోగా ఇప్పటి వరకు బకాయి ఉన్న కరువుభత్యం చెల్లించాలని, మధ్యంతర భృతి (ఐఆర్) చెల్లించాలని కోరారు. విద్యా పరంగా మోడల్ ప్రైమరీ స్కూల్ పేరుతో వివిధ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల మూసివేత తగదని తెలిపారు. అలాగే హైస్కూల్‌లో రోల్ 53 (విద్యార్థుల సంఖ్య) కు ఒక సెక్షన్ అనేది చాలా అసంబద్ధంగా ఉందన్నారు. తక్షణమే ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి మార్పులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హైస్కూల్లో ఇంగ్లీష్ మీడియం తోపాటు తెలుగు మీడియం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న జిఒల్లో ఉన్న అసంబద్ధాలను యూనియన్ నాయకులతో చర్చించి భవిష్యత్తులో జరిగే బదిలీలు, ఉద్యోగన్నతులు సజావుగా సాగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. త

'మీ ఆలోచనలే రేపటి ప్రపంచం'

ప్రజాశక్తి - కాకినాడ

మీ ఆలోచనలే రేపటి ప్రపంచం అని ఐడియాల్ డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినికుమారి అన్నారు. మంగళవారం స్థానిక ఐడియల్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత ఆశయాలు, ఆలోచనలే రేపటి భవిష్యత్‌కు నాంది అని అన్నారు. జీవితంలో కళాశాల సమయం ఎంతో విలువైనదని, ఇక్కడ నుంచే అసలు జీవిత ప్రయాణం ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులు నేర్చుకున్న పాఠాలు, సంస్కారం, ప్రవర్తన, క్రమశిక్షణపైనే సమాజంలో ఏవిధమైన పాత్ర పోషిస్తారనే విషయం అవగతమవుతుందని అన్నారు. ఇక్కడ ఉన్నంత వరకు ఎంతో సంతోషంగా, ఉల్లాసంగా స్నేహితులతో గడుపుతారని కానీ బయట ప్రపంచం వేరేగా ఉంటుందన్నారు. నన్నయ యూనివర్శిటీ పిజి సెంటర్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా స్వయం ఉపాధితో సూక్ష్మతరహా పరిశ్రమలు నెలకొల్పుకుని పారిశ్రామికంగా అభివృద్ధి చెంది పలువురికి ఉపాధి కల్పించేలా ఎదగవచ్చని సూచించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు, న్యాయవాది అయ్యగారి వెంకటేష్ మాట్లాడుతూ ఈ కళాశాల నుంచి చదువుకున్నవారు రాజకీయ, సినిమా, పారిశ్రామిక రంగంలో దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, మెమెంటోలు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.స్టీవెన్ రాజు, వి.నాగేశ్వరరావు, డాక్టర్ కె.స్వామీజీ, వైఆర్ఎల్. చౌదరి, డి.విశ్వనాధరాజు, కె.రాజేంద్రకుమార్, జి.రాజు, పి.గోపి, జి.మార్తాండం, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డాక్టర్ చిరంజీవినికుమారి

మెడికవర్ సేవలు అభినందనీయం: ఎస్‌పి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సామాజిక సేవలో మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం ముందుండటం అభినందనీయమని ఎస్‌పి జి.బిందుమాధవ్ కొనియాడారు. మంగళవారం మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ శుభాకర రావు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌కు వినియోగించే 100 బారికేడ్లను ఎస్‌పికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా పోలీసు శాఖకు మెడికవర్ హాస్పిటల్ సంస్థ అండగా నిలుస్తుందని అన్నారు. పోలీసులకు అనేక సందర్భాల్లో ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం 100 బారికేడ్లను అందించడం అభినందనీయమని మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ శుభాకర రావు మాట్లాడుతూ పోలీసు శాఖకు తమ యాజమాన్యం వైద్య, ఆరోగ్య సేవలకు అందించేందుకు ముందు వరుసలో ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉమెన్ అండ్ ఛైల్డ్ విభాగాన్ని ఎస్‌పి బిందుమాధవ్, అడిషనల్ ఎస్‌పి మనీష్ దేవరాజ్ పాటిల్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీహరిరాజు, సిఐలు చైతన్యకృష్ణ, భగవాన్, ట్రాఫిక్ సిఐలు మురళీకృష్ణ, రామారావు, మెడికవర్ హాస్పిటల్స్ ఆపరేషన్స్ హెడ్ ఖాద్రి, మార్కెటింగ్ హెడ్ ఎం.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



బారికేడ్లను ప్రారంభిస్తున్న ఎస్‌పి బిందుమాధవ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ వనమాడి

మత్స్యకార పరిహారం పెంపుపై హర్షం

ప్రజాశక్తి - కాకినాడ

మత్స్యకార పరిహారం పెంపుదలపై హర్షం వ్యక్తం చేస్తూ నగరానికి చెందిన పలువురు బోటు యజమానులు, లబ్ధిదారులు ఉప్పుటేరులో బోట్లుపై ప్రయాణిస్తూ సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల నుంచి రూ.20 వేలకు అందజేయడం అభినందనీయమన్నారు. వైసిపి పాలనలో మత్స్యకారులకు పరిహారం ఇవ్వకుండా మాయమాటలతో నమ్మించి మోసం చేశారని విమర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ వనమాడిపై బోటు యజమానులు, లబ్ధిదారులు పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో బోటు యజమానుల సంఘం అధ్యక్షుడు సంగాని నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మల్లాడి రాజు, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు బలసాడి రంగారావు, బోటు యజమానులు, టిడిపి నాయకులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ పాల్గొన్నారు.

కార్మికులకు ఉపాధి కల్పించేలా చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

కాకినాడ పోర్టులో ఎగుమతి, దిగుమతులు సజావుగా సాగేలా చర్యలు తీసుకుని కార్మికులకు ఉపాధి కల్పించాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం సుందరయ్య భవన్‌లో కె. సత్తిరాజు అధ్యక్షతన సిపిఎం నగర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పోర్టులో బియ్యం ఎగుమతి, దిగుమతులపై చేసిన హడావుడితో పోర్ట్ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. కాకినాడ పోర్ట్ ద్వారా జరగవలసిన ఎగుమతి, దిగుమతులు విశాఖ, కృష్ణపట్నంతోపాటు, ఇతర రాష్ట్రాలకు తరలిపోవడం జరుగుతుందన్నారు. దీనివల్ల పెద్ద సంఖ్యలో కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. పోర్టులో లావాదేవీలు వేగంగా జరిగేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ జిల్లా మంత్రిగా ఉండడంతో జిల్లా అంతా అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశించారని అన్నారు. అభివద్ధికి కొలమానం ఉపాధి కల్పనే అనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అయితే ఉప ముఖ్యమంత్రి కార్యాచరణ అందుకు తగిన విధంగా లేదన్నారు. ఇప్పటికైనా రాజకీయ ప్రయోజనాల చట్రంలో కూరుకుపోకుండా చిత్తశుద్ధితో అభివృద్ధి దిశగా ఉప ముఖ్యమంత్రి, స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని సిపిఎం కోరుతుందన్నారు. ఈ సమావేశంలో దుంపల ప్రసాద్, వేణు, మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమరౌతు కుటుంబానికి గిరిబాబు పరామర్శ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోమరౌతు చిట్టిరాజు భార్య వెంకాయ్యమ్మ(96) మంగళవారం తుది శ్వాస విడిచారు. ఆమె భౌతికాయాన్ని ప్రతిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుమారుడు వెంకన్నదొరను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు చింతకాయల వీరవెంకటసత్యనారాయణ, నాయకులు వాసిరెడ్డి భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

231.1 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో మంగళవారం 231.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మండలాల వారీగా కోటనందూరులో 14.4, తునిలో 24.4, రౌతులపూడిలో 2.2, శంఖవరంలో 60, ఏలేశ్వరంలో 19.6, జగ్గంపేటలో 20.4, కిర్లంపూడిలో 23.6, ప్రత్తిపాడులో 19.2, తొండంగిలో 38.2, పెద్దాపురంలో 4.6, గండేపల్లిలో 8.2 మిల్లి మీటర్ల చొప్పున వర్షపాతం నమోదయింది.

నిబంధనలు తప్పక పాటించాలి

ప్రజాశక్తి - కాజులూరు

వాహనదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ సూచించారు. మంగళవారం గొల్లపాలెంలో వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించి, వాహన దారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారని, మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే వాహన యజమానులకు జరిమానాతో పాటు లైసెన్స్ రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీలో సిబ్బంది వీరబాబు,శేఖర్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక రామకృష్ణారావుపేట శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభించారు. ఈ శిక్షణలో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పుస్తక పఠనం, కథలు రాయించారు. 9 గంటల నుంచి 10 గంటల వరకు జికె, స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రమేష్‌బాబు, వి.రత్నం, పి.ప్రీతి, అడబాల హరి తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కకు అంత్యక్రియలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక ఎస్‌సి కాలనీలో ప్రజలు 20 సంవత్సరాలుగా పెంచుకుంటున్న వీధి కుక్క మంగళవారం అకస్మాత్తుగా మృతి చెందింది. దీంతో వీధికి చెందిన ప్రజలు ఆ కుక్క మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి తమ మమకారాన్ని చాటుకున్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని సినిమా రోడ్డుకు చెందిన మీసాల గౌతం హత్య కేసులో పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మనీష్ దేవరాజ్ పాటిల్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. మీసాల గౌతమ్ నెల రోజుల నుంచి తను ప్రేమించిన అమ్మాయి ఇంటి వద్ద రేచర్ల పేటలో ఉంటూ అక్కడ నుంచి తన ఆటోలో రొయ్యల కంపెనీలో పని చేసే వారిని ప్రతిరోజు విధులకు తీసుకెళ్లి తీసుకువస్తుంటారన్నారు. శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో గౌతం తన ఆటో దగ్గరికి వెళుతుండగా ప్రకాష్ కిళ్లీ కొట్టు దగ్గరకు వెళ్లేసరికి అతని స్నేహితులైన యాదాల దుర్గాప్రసాద్, యాదాల నవీన్‌కుమార్, మహమ్మద్ సందాని, షేక్ ఇమ్రాన్ అతనిని ఆపి మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని అడిగారు. తన వద్ద డబ్బులు లేవని సమాధానం ఇచ్చాడు. దీంతో వారు గౌతమ్‌తో ఘర్షణకు దిగారు. ఆ పక్కనే ఉన్న కాంక్రీట్ సిమెంట్ రాళ్లతో గౌతమ్ దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. దీంతో అతనిని జిజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో అదేరోజు మృతి చెందారని తెలిపారు. దీనిపై నమోదైన కేసులో పరారైన నలుగురిని టూటౌన్ పోలీసులు మంగళవారం కోటిపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో ఉన్నట్లు వచ్చిన సమాచారంతో వెళ్లి అరెస్టు చేశారని తెలిపారు. ఈ సమావేశంలో టూటౌన్ సిఐ ఎం.అప్పలనాయుడు, ఎస్ఐ వికిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక శివాలయంలో వెండి విగ్రహాలు చోరీకి యత్నించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దుర్గాడ గ్రామానికి చెందిన పసుపులేటి శివాజీ మంగళవారం తెల్లవారుజామున స్థానిక శివాలయంలో దేవుని వెండి విగ్రహాలు చోరీ చేసేందుకు యత్నించాడు. శివాలయంలో అలికిడి రావడంతో చుట్టుపక్కల వారు చూశారు. దీంతో విగ్రహాలతో పారిపోతున్న శివాజీని స్థానికుల పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళకి గాయాలయ్యాయి. పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. చెందుర్తికి చెందిన కాళ్ళ కాంతం ఉపాధి హామీ పనికి వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటుతుండగా కొత్తచెరువు సమీపంలో మహిళను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు గాయలు కావడంతో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడనుండి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

తాగునీటీ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వేసవిలో తాగునిటీ సమస్యను అదిగమించెందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ముమ్మిడివరం ఎంపిపి కోలా గంగాభవాని సూచించారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలు నందు మంగళవారం ఎంపిపి గంగా భవాని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధశాఖల పని తీరును సమీక్షించారు. మారుముల గ్రామాలకు సైతం తాగునీరు సరఫరా సక్రమంగా జరిగేలా అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ఎక్కడ తాగునిటీ ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అయినా పురం ఎంపిటిసి సభ్యుడు మట్టపర్తి సురేష్ సంబంధిత శాఖ అధికారి నిర్వాకంతో సిఎస్ఆర్ నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మించి ప్రారంభోత్సవం జరిగినా పైపు లైనులకు వాల్వ్‌లు, ట్యాప్‌లు లేకపోవడంతో ట్యాంక్ నిరూపయోగంగా మరిందని సంబందిత ఎఇ నానాజీరావుపై మండిపడ్డారు. పంచాయతి రాజ్ పర్యావేక్షణ లో రూ.33 కోట్లతో చేపట్టిన 33 సిసి రోడ్ల పనులకు 26 పనులు పూర్తి చేసినట్లు, మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని, అలాగే మండల పరిషత్ నిధులతో రూ.90 లక్షల వ్యయంతో 71 పనులు చేపట్టాగా 51 పనులు పూర్తి చేసినట్లు, మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నట్లు ఇన్‌ఛార్జ్ డిఇ శ్రీనివాస్ తెలిపారు. దీనిపై ఎంపిటిసి సభ్యుడు, వైస్ ఎంపీపి సురేష్ మాట్లాడుతూ గౌరవ సభ్యులకు తెలపకుండా పనులు చేపట్టడం పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి వాక్ అవుట్ చేశారు. మండల విద్యా శాఖధికారి ఉదయ భాస్కర్ నూతన విద్యా విధానంలో అమలౌతున్న ప్రగతిని, మండలం లో ఐదు మోడల్ పాఠశాలల ప్రగతిని వివరించారు. శేరిలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి భవ్య కేంద్ర, రాష్ట్రాలు అమలు చేస్తున్న పలు ఆరోగ్య పథకాలతో పాటు ప్రస్తుతం 63 మెడికల్ టెస్టులు, 130 రకాల మందులు అంది స్తున్నామని వివరించారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇల్లు నిర్మించుకునేందుకు అర్హులైన వారి నుంచి 495 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ సమావేశం లో జడ్‌పిటిసి సభ్యుడు కుడిపూడి శివ శంకర రావు, ఎంపిడిఒ టిఎస్.వెంకటా చార్య, ఇఒపిఆర్‌డి లక్ష్మి కళ్యాణి లతో పాటు పంచాయతీ కార్యదర్సులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పహల్గామ్ ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

కాశ్మీర్లో పహల్గామ్ ఘటనను నిరసిస్తూ మంగళవారం రాత్రి యానాం వర్తక సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మతులకు నివాళులర్పించారు. స్థానిక కె.జంక్షన్ నుంచి ఆర్ఎఒ కార్యాలయం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఐ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు నల్లా వెంకన్న, మాజేటి సత్యభాస్కర్, కాపగంటి గోపాలకృష్ణ, మల్లాడి విష్ణు, మంచాల సత్యసాయి కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

బాలుని మృతదేహంతో ఆందోళన

ప్రజాశక్తి - రౌతులపూడి


రోడ్డుపై రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వైద్యం వికటించి ఒక బాలుడు మృతి చెందాడంటూ కుటుంబీకులు మృతదేహంతో ఆందోళనకు దిగని సంఘటన మంగళవారం మండలంలోని గిడజం గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలావున్నాయి...గిడజం గ్రామానికి చెందిన చెక్క దుర్గాప్రసాద్ కుమారుడు చెక్క హర్షవర్ధన్(11 నెలలు) నీరసంగా ఉండటంతో మంగళవారం రైతులపూడి లోని బ్రహ్మానందం అనే పిఎంపి వైద్యుని వద్దకు తీసుకొచ్చారు. వైద్యుడు పరీక్షించి బాలునికి ఇంజక్షన్ చేసి, మందులు ఇచ్చారు. దీంతో ఆ బాలుడిని తిరిగి స్వగ్రామం తీసుకెళ్లి డాక్టర్ ఇచ్చిన మందులను పట్టించారు. దీంతో ఆ బాలుడు ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో ఆ బాలుడిని హుటాహుటీన రౌతులపూడి పిహెచ్‌సికి తీసుకొచ్చారు. ఆ బాలుడిని పరీక్షించిన ప్రభుత్వ వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో గ్రామస్తులు, కుటుంబీకులు గిడజం రహదారిపై మృతదేహంతో ఆందోళనకు దిగారు. అనంతరం బాలుడి మృతికి పిఎంపి వైద్యుడి ఇచ్చిన మందులే కారణమని ఆరోపిస్తూ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, బాలుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

పుస్తక పఠనంతోనే ఉన్నత స్థానం

ప్రజాశక్తి - కాకినాడ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్, తదితరులు

పుస్తక పఠనంతోనే ఉన్నత స్థానానికి చేరుకోగలమని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. మంగళవారం జెఎన్‌టియుకెలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, కైట్ విద్యాసంస్థల గౌరవాధ్యక్షులు ఎం.గోపాలకృష్ణ రచించిన కర్మయోగి అనే పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం.పల్లంరాజు, మేజర్ జనరల్ ప్రసాద్, ప్రొఫెసర్ మురళీకృష్ణ, కైట్ కాలేజ్ ఛైర్మన్ పోతుల విశ్వం, కైట్ డైరెక్టర్ ఐశ్వర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక రచయిత గోపాలకృష్ణ కాకినాడ ప్రాంతంలో గోదావరి ఎరువులు కర్మాగారాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. విద్యార్థులు సృజనా శక్తిని పెంపొందించుకోవడానికి పుస్తక పఠనం దోహదం చేస్తుందన్నారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కైట్ విద్యార్థులు, గోదావరి ఎరువుల కర్మాగారం విశ్రాంతి ఉద్యోగులు, వివిధ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించేలా చర్యలు

ప్రజాశక్తి - తాళ్ళరేవు


ఎంఎల్ఎకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

తాళ్లరేవు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 392/1ను నిషేధిత భూముల జాబితాలో నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంఎల్ఎకు ఈ మేరకు గ్రామస్తులు కలిసి తమ ఇబ్బందులను వివరించారు. గత కొంతకాలంగా ఈ సర్వే నెంబర్‌లో ఉన్న భూముల యజమానులు అమ్మకాలు, కొనుగోలు వంటి లావాదేవీలు జరగక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆయనకు వివరించారు. దీంతో స్థానిక తహాశీల్దార్ త్రినాధరావును పిలిచి ఎందుకు రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేశారని ఆరా తీశారు. క్రయ, విక్రయాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎంఎల్ఎను కలిసిన వారిలో మాజీ ఎంపిటిసి సభ్యులు గంజా సూరిబాబు, మేడిశెట్టి సత్యనారాయణ, నాయకులు నడింపల్లి వినోద్‌రాజు ఉన్నారు.

కుక్కలు, పందుల నిర్మూలనకు డిమాండ్

ప్రజాశక్తి - పెద్దాపురం


కౌన్సిల్‌లో మాట్లాడుతున్న కౌన్సిలర్ రాజశేఖర్

పట్టణ పరిధిలో కుక్కలు, పందులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. మంగళవారం ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆరేళ్ల వీరరాఘవ, విడదాసరి రాజా, త్సలికి సత్య భాస్కరరావు, ఆకుల కృష్ణబాపూజీ, తదితరులు పట్టణంలో కుక్కలు, పందులు పెరిగిపోయాయని, వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయన్నారు. రాత్రి సమయంలో రహదారిలో వెళ్లడానికి ప్రజలు భయ పడుతున్నారన్నారు. వీటి నివారణ కు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై కమిషనర్ కెవి.పద్మావతి మాట్లాడుతూ కుక్కల నివారణకు చర్యలు చేపట్టామని, ఇప్పటివరకు సుమారు 70 కుక్కలను పట్టుకున్నట్టు తెలిపారు. ఛైర్‌పర్సన్ తులసి మంగతాయారు మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఏ ప్రాంతంలోనూ మంచినీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, డిఇఇ డిఎస్.ప్రకాశరావు, టిపిఒ ఫణికుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - సామర్లకోట


ఎంఎల్ఎ చినరాజప్పను సత్కరిస్తున్న పాస్టర్లు

నియోజకవర్గంలో క్రైస్తవ ప్రజలకు, క్రైస్తవ చర్చిలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తన వంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప హామీ ఇచ్చారు. మంగళవారం మండల పరిధిలోని పలువురు పాస్టర్లు ఎంఎల్ఎను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పాస్టర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బిషప్ టి.బ్లెస్సింగ్, జి.జయబాబు మాట్లాడుతూ సువార్త సేవలో కొనసాగుతున్న పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం 7 నెలలకు గాను గౌరవ భృతిగా రూ.35 వేలు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కొన్నిచోట్ల చర్చిల్లో జరుగుతున్న ఆరాధనల విషయంలో కొందరి వలన కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎ.చంటిబాబు, జె.జయరాజు, రాజు, అబ్రాహం, ప్రభుదాస్ పాల్గొన్నారు.


క్రీడాకారుడిని అభినందిస్తున్న కలెక్టర్

నాగబాబుకు సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ

జాతీయ స్థాయి పరుగు పందేల్లో 3 పతకాలు సాధించిన పిఠాపురానికి చెందిన అథ్లెట్ యాతం నాగబాబు జిల్లా క్రీడల అభివద్ధి అధికారి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబును కలెక్టర్ సత్కరించారు. భవిష్యత్తులో జాతీయస్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

వేసవి శిబిరంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం 2వ రోజు మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. తామరాడ స్కూల్ అసిస్టెంట్ వై.శ్రీనివాస్ మ్యాథమెటిక్స్‌లో మెలకువలు, సూత్రాలు బోధించారు. కోటపాడు హెచ్‌ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు స్పోకెన్ ఇంగ్లీష్, ఇంగ్లీష్ గ్రామర్‌పై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు చందమామ కథలు అర్థవంతంగా చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీరమణి

పారదర్శకంగా రీసర్వే

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సాంకేతిక పరిజ్ఞానంతో భూ రీసర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ కె.శ్రీరమణి అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని ఎర్రవరం గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 11 బృందాలు రీసర్వే పనులను నిర్వహిస్తున్నాయని వివరించారు. గ్రామ సరిహద్దులు, సర్వే జరిగే ప్రాంతాలలో ప్రభుత్వ భూమి గుర్తించాలని అధికారులకు సూచించారు. స్థానిక రైతుల సమన్వయంతో రీ సర్వే పనులను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ కుశరాజు, రీ సర్వే డిటి సంధ్య, ఆర్ఐ పొన్నాలు, విఆర్ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి


కార్యకర్తలతో మాట్లాడుతున్న గిరిబాబు

నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన దాడిశెట్టి నూకాపతిరావు మంగళవారం ముద్రగడ నివాసంలో గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో పదవుల పొందిన ప్రతి ఒక్కరూ గ్రామస్థాయిలో పార్టీని నిర్మాణం చేసేందుకు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ జాయింట్ కార్యదర్శిగా నియమించేందుకు కృషి చేసిన ముద్రగడ గిరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి రామారావు, వైస్ ఎంపిపి బంకు శ్రీను, వైసిపి నాయకులు రామిశెట్టి నాని, తట్టవర్తి రామన్నదొర, బత్తుల నాగార్జున, కొండే శ్రీను పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచే నాటికి కిట్ల సిద్ధం

ప్రజాశక్తి - పెద్దాపురం


అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు చంద్రశేఖర్

జూన్‌లో స్కూల్స్ తెరిసే నాటికి విద్యార్థులకు సంబంధించిన సమస్త సామగ్రి కిట్స్ సిద్ధంగా ఉంటాయని రాష్ట్ర పరిశీలకులు చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక రాజీవ్ కాలనీ యుపి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకి సంబంధించిన అన్ని రకాల స్టూడెంట్ కిట్స్ సరఫరా మొదలైందన్నారు. ఇప్పటికే విద్యార్థుల నోటుబుక్స్ ప్రతి మండల స్టాక్ పాయింట్‌కు సరఫరా చేశారన్నారు. స్టాక్ పాయింట్ వద్ద అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరిశీలనలో డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ చామంతి నాగేశ్వరరావు, స్టాక్ పాయింట్ హెచ్‌ఎం రమాదేవి, ఎంఇఒలు ఈరంకి ప్రభాకరశర్మ, విఆర్‌కె.చౌదరి పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ మొబైల్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి అధికారి మాట్లాడుతూ ఉగ్రవాదులు చర్యలను ప్రతి ఒక్కరూ ముక్త కంఠంతో వ్యతిరేకించాలన్నారు. మతుల ఆత్మశాంతి కి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ధనబాబు, చంటి, పణి, రామకృష్ణ, శివ పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - కోటనందూరు

ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విక్టరీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ చిన్ని సత్కరించారు. మంగళవారం స్టడీ సెంటర్ ఆవరణలో జరిగిన అభినందన సభలో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థిని లంక పూర్ణిమ(581), అల్లిపూడి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన అనిమిరెడ్డి అలేఖ్య(573), బొద్దవరం జడ్‌పి హైస్కూల్‌కి చెందిన పొన్నాడ భార్గవ్(569)లను ఎంపిపి లగుడు శ్రీనివాస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వెలగా వెంకటకృష్ణారావు చేతుల మీదుగా సత్కరించి మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ జి.రాజేశ్వరి, కడితి నూకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రతీ ఒక్క మహిళా రాజ్యాంగం ద్వారా కల్పించిన మహిళా చట్టాలను అవగాహన చేసుకోవాలని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం తాళ్లరేవులో బీమాబాయి మహిళా మండలి సంఘం అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధన అధ్యక్షతన మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో హింసాత్మక ప్రవృత్తి నిర్మూలమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మహిళలు, బాలికలు ధైర్యంగా ముందడుగు వేసి ప్రభుత్వ వ్యవస్థలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా న్యాయం పొందాలన్నారు. గత 30 సంవత్సరాలుగా మహిళా సమస్యలపై పనిచేస్తున్న బీమా బాయి మహిళా మండలిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మండలి కోశాధికారి పులగల రత్నకుమారి, న్యాయవాది వి.ఎం.ఝాన్సీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం పార్లమెంట్ పరిశీలకునిగా ముదునూరి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకునిగా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి మంగళవారం ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని సిఎంని చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. నాపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నరసాపురం పార్లమెంట్లో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి పని చేస్తానని అన్నారు. ఆయన నియామకం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్సాహభరితంగా ఎన్‌సిసి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం


షూటింగ్‌లో శిక్షణ పొందుతున్న క్యాడెంట్లు

18వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి వార్షిక శిక్షణా శిబిరం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడుతుందని అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్ట్‌నెంట్ సనపల సత్యనారాయణ అన్నారు. స్థానిక నవోదయ విద్యాలయలో జరుగుతున్న శిక్షణా శిబిరం నేటితో ముగియనుంది. క్యాంపులో డ్రిల్లు, ఫైరింగ్, టెంటు పచ్చింగు, మ్యాప్ రీడింగు, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, సాంస్కృతిక, ఆటలు, పాటలు, వివిధ స్కిల్ సబ్జెక్టులపై శిక్షణ పొందుతున్నారు.


ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ పంతం నానాజీ

బీచ్ కబడ్డీ పోటీల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక ఎన్‌టిఆర్ బీచ్‌లో మే 2 నుంచి 4వ తేదీ వరకూ నిర్వహించే బీచ్ కబడ్డీ పోటీల ఏర్పాట్లును ఎంఎల్ఎ పంతం నానాజీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్ కబడ్డీ పోటీలను కనివినని రీతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 3 రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి 26 పురుషులు, మహిళా జట్లు పాల్గొంటున్నాయని వివరించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పట్టుబడిన సామగ్రి వేలం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన పలు రకాల సామాగ్రిని మంగళవారం బహిరంగ వేలం వేశారు. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జయ మౌనిక పర్యవేక్షణలో నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో వ్యాను రూ.22 వేలు, వాటర్ మోటారు రూ.3 వేలు, అల్యూమినియం పాత్రలు, గ్యాస్ స్టవ్, సిలిండర్లు రూ.2 వేలలో పాడుకున్నారని ఎక్సైజ్ సిఐ కెవివి.దుర్గార్జునరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఎస్ఎస్ఎస్ డివి.ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.